

పాతబస్తీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న షియా ముస్లింలు

## పాతబస్తీలో షియా ముస్లింల ర్యాలీ

చార్మినార్, మార్చి 31 ప్రభాతవార్త : రంజాన్ నెల 20వ రోజు హజ్రత్ అలీ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ పాత బస్తీలో షియా ముస్లింలు ర్యాలీ నిర్వహిం చారు. చార్మినార్, గుల్జారాహౌస్, షెహరాన్ హోటల్, పత్తర్‌గట్టి, మదీనా, ఛత్తాబజార్, లక్కడ్‌కోట, పురానీహవేలీ, దారుషిపా, మసీదు ఎ ఇమామియా ప్రాంతాలలో ర్యాలీ జరిగింది. షియా ముస్లిం యువకులు ర్యాలీలో మాతం నిర్వహించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం

మిగతా సిటీ 3వ పేజీలో



హైదరాబాద్ వార్త

ఏదీ నియంత్రణ?

# నిత్యం నరకయాతనే..

## రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు గంటన్నర సమయం

**విలువైన సమయం వృథా**

**పడిపోతున్న వాహనాల మైలేజీ**

**తీవ్రతరంగా ట్రాఫిక్ రద్దీ**

**చోద్యం చూస్తున్న యంత్రాంగం**



హైద్రాబాద్, మార్చి 31 ప్రభాతవార్త: మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఎన్ని ఆకాశమార్గాలు నిర్మించినా ఫలితం ఉండటం లేదు. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ ఆగిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదు. కనిపించినా కేవలం ట్రాఫిక్ పెండింగ్ ఛలాన్ల తనిఖీలకు పరిమితం అవుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించుకొని ఇంటికి చేరాలంటే పద్మవ్యూహాన్ని ఛేధించినంతగా శ్రమించాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులకు నరకాన్ని చవిచూపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అంటే కేవలం చలాన్‌లు విధించడమే తప్ప ట్రాఫిక్ చిక్కులను తప్పించేవారు కాదనేంతగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగంరలో నిర్థిత సమయంలో రాకపోకలు సాగించాల్సి వాహనాలు ఇష్టానుసారంగా తమ ఇష్టమైన సమయంలో నగర రోడ్లపైకి వస్తున్నాయి. దీనికి తోగు కొన్ని ప్రాంతాల్లో భారీ వాహనలు రోడ్లపైనే నిలపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లను నివారించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్‌లు విధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలను చేసినా ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. నగరంలో అందుబాటులో మెట్రో రైళ్లు, ఎంఎంటిఎస్ రైళ్లు, ప్రధాన కూడళ్లలో ఫ్లైఓవర్లు ఉన్నా కూడా ఫలితం దక్కడం లేదు. చాలా వరకు ప్రధాన రోడ్లన్ని వాహనాలతో నిండిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి గమ్యస్థానాలు చేరుకోడానికి రెండు, రెండున్నర గంటల పాటు ఇబ్బందులు పడక తప్పడం లేదు. వాహనాలు రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు కనీసం గంటన్నర సమయం పడుతుందంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. దీంతో వాహనాల విలువైన సమయం వృథా కావడంతో పాటు గమ్యం చేసేవరకు రోడ్ల వాహనాల ఇంజన్ ఆన్‌లో ఉండడంతో పెట్రో డీజిల్ ఆవిరైపోతున్నాయి. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దని పెద్ద మనస్సుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇదే సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రణాళిక రూపొందించకపోవిడంపై పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

### గతంలో ఎన్నడూలేనంతగా..

నగరంలో నిత్యం కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. అవన్నీ రెండు మూగు గంటల్లోపు సాఫీగా మారతాయి. ఇటీవల ఎన్నడూ కనిపించని ట్రాఫిక్ సమస్య ఇటీవల తీవ్రరూపం తలెత్తుతోంది. ఉదయం నుంచి సాయంంత్రం వరకు ఏ మార్గంలో వెళ్లినా కిలో మీటర్ల మేర వాహనాలు ఆగిపోయి కనిపించాయి. మాదాపూర్– జూబ్లీహిల్స్– బంజారాహిల్స్, మెహిదీపట్నం– మాసాబ్‌ట్యాంక్, అసెంబ్లీ– అబిడ్స్, హబ్సిగూడ–నాచారం తదితర ప్రాంతాల్లో సాయంంత్రం వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. అమీర్‌పేట్–పంజాగుట్ట–ఖైరతాబాద్–లక్డీకాపూల్, మలక్‌పేట్–దిల్‌సుఖ్‌నగర్, మెట్టుగూడ– తార్నాక– ఉప్పల్–మేడిపల్లి, బేగంపేట్–రసూల్‌పురా– సికింద్రాబాద్– మినిస్టర్‌రోడ్, బేగంబజార్–చార్మినార్ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం అయ్యియి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే దాదాపు రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. గతంలో పండుగలు, ఆదివారాలలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. కాని ఇప్పుడు దానికి భిన్నంగా తయారైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడినా అవి గంట సమయంలోనే సాఫీగా మారతాయి. వర్షాకాలం వస్తే మాత్రం ఎప్పటికి ట్రాఫిక్ క్లియర్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.

**ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెంచినా**

నగంరలో ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించడానికి అధికారులు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కలేదు. గతంలో నగర వ్యాప్తంగా 18 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉండగా వాటిని 31కి పెంచారు. ట్రాఫిక్ పోలీసుల సంఖ్య కూడా దాదాపు 3వేలకు పైగానే ఉంది. అయినప్పటికి ఫలితం అంతంత మాత్రమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడం కోసం అధికారులు రాత్రి 11 గంటలకే వ్యాపారాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాని అమలు జరుగడం లేదు. భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సులు నగరంలోకి ప్రవేశించడానికి నిర్ధేశిత సమయంలో మాత్రమే అనుమతి ఉంది. కాని సమయంతో పనిలేకుండా యధేచ్ఛగా తిరుగుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుపక్కన నిలుపుతుండడంతో ప్రధానరోడ్లలో ట్రాఫిక్ జామ్‌కు కోన్నిచోట్ల కారణమవుతున్నాయి. కొన్ని హోటల్స్, బార్‌లు, వైన్‌షాపుల ముందు రోడ్లపైనే ద్విచక్రవాహనాలు నిలిపి కోనుగోలు చేస్తుండడంతో ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వ్యాపారుల వద్ద ట్రాఫిక్ పోలీసులు మామూళ్ళు వసూల్ చేస్తున్నట్లు సమాచారం.

**ఇలా చేస్తేనే ఫలితం..**

■ ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తన కాన్వాయ్ కోసం ఎక్కువ సేపుట్రాఫిక్‌ను ఆపొద్దనడం ద్వారా సమస్యను సిఎం గుర్తించారు. కానీ ట్రాఫిక్ విభాగం మాత్రం పట్టించుకోవడం లేదు. మహానగరంలో మూడువేల మంది ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా కనీసం 200 మంది కూడా రోడ్లపై కనిపించడం లేదు ■ ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్‌పై అవగాహన ఉన్న అధికారులను నియమించాలి ■ కొన్ని జంక్షన్లను, మలుపులను విస్తరించాలి ■ ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఛలాన్‌ల వసూల్‌లపై దృష్టిసారిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందికి రోజువారి టార్గెట్‌లను విధించడం వల్ల వారు ఛలాన్‌లు విధించడంపైనే దృష్టి సారిస్తున్నారు ■ వాహనాలకు అడ్డుగా వెళ్లి వాహనాలను నిలిపి పెండింగ్ ఛలాన్లు ఉరిశీలిస్తున్న తీరులో వెనుక నుండి వచ్చే వాహనాలను నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య సమస్య ఏర్పాడుతోంది ■ ప్రతి చౌరస్తాల్లో ట్రాఫిక్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి ■ ప్రతి చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ పని చేసేలా చూడాలి ■ జిబ్రాక్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలి మొబైల్ ట్రాఫిక్ వాహనాలను అందుబాటులో ఉంచాలి ■ ఫుట్‌పాత్‌లు అక్రమణలు గురికాకుండా చూడాలి. అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలి ■ కొన్ని బిర్యాని సెంటర్లు, బార్‌లు, వైన్స్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు వసూల్‌కు పాల్పడుతుండడం వల్ల ఇక్కడి ట్రాఫిక్‌ను నియంత్రించడంలో వెనుకంజ వేస్తున్నారు. వాటిపట్ల కఠినంగా వ్యవహరించాలి.

# మండిపోతున్న ఎండలు

## అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త: భాగ్యనగరంలో భానుడి ప్రభంజనం కొనసాగుతోంది. నగర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. వడగాలులు, ఉష్ణోగ్రతలు ప్రజలని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పలు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. సాధారణం కంటే 3-4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఇప్పటికే విపరీతమైన వేడి, చెమటతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం నగరంలో 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అల్లాపూర్‌లో 42.3, గౌలిగూడలో 41.4, నాగోల్‌లో 42.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అలాగే ఉప్పల్‌లో 42.4, జుమ్మెరాత్‌బజార్‌లో 41.4, కాప్రాలో 41.5, హయత్‌నగర్‌లో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఉపరితల గాలులు అగ్నేయ దిశలో గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతలతో తేమశాతం పెరగడంతో జనం వడదెబ్బకు గురవుతున్నారు. దీంతో పాటు పలుప్రాంతాల్లో వీస్తున్న వేడి గాలులు మరింత ఇబ్బందిగా మారాయని నిపుణులు చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం పూట బయటికి వెళ్లకూడదని, ఆరు బయట భారీ శారీరక శ్రమ చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. వీలైనంత ఎక్కు నీరు తాగాలని, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని వివరించారు. జిమ్‌లు, అవుట్‌డోర్‌లలో వ్యాయామం చేసేవారు కూడా జాగ్రత్తగా ఉండాలి. డీహైడ్రేషన్ ఇతర పరిస్థితులు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంత వరకు బయటకు వెళ్లకపోవడమే మంచిదని చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలు బయటకు రాకుండా ఉంటేనే మంచిదని చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలలంటేనే నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదు

## కాంగ్రెస్‌కు ఓటేసినందుకు బాధపడుతున్నారు: కెటిఆర్



అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కెటిఆర్, చిత్రంలో సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త: కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి అంబర్‌పేటలో విస్తృతంగా పర్యటించారు. భారీ ఎత్తున ప్రజలు ఈ పర్యటనలో పాల్గొని కెటిఆర్, పద్మారావుగౌడ్‌లకు సాధార స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అడుగడుగునా స్వాగతం పలికిన బస్తీవాసులను కెటిఆర్, పద్మారావుగౌడ్‌లు పలుకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇస్తామన్న ఆరు గ్యారంటీ లు పక్కకుపోయాయని, ఆరు గ్యారెంటీలు పోయి ఆరు గారడీలు వచ్చాయని విమర్శించారు. కల్యాణలక్ష్మీ పథకం కాఇంద తులం బంగారం, పెంచిన ఆసరా పింఛన్లు ఇవ్వడంలేదని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో బిఆర్ఎస్ ఏనాడూ రాజకీయం చేయలేద న్నారు. ఇక్కడ ఎంపిగా గెలిపిస్తే దేశానికి కేంద్ర మంత్రైన కిషన్‌రెడ్డి ఒక్క అభివృద్ధి పనైనా చేయలేదని విమర్శించారు. సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కెటిఆర్ కోరారు.

## కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ధ్వజస్థంభ యంత్ర ప్రతిష్ట సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు



బోరబండ శ్రీచక్రసహిత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ధ్వజస్థంభ మహాకుంభాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

యూసుఫ్‌గూడ, మార్చి 31, ప్రభాతవార్త : బోరబండలోని శ్రీచక్రసహిత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ధ్వజస్థంభ యంత్ర ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకలు ప్రతిరోజు వివిధ పూజ కార్యక్రమాలతో భక్తుల తో ఆలయం భక్తి పరవశంతో నిండి పోయింది. ఆదివారం నాలుగవ రోజు ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కుంభాభిషేక మంటపావాహనాలు, దేవతార్చనలు, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మూలమంత్ర ఆవాహనములు కుంభాభిషేక కలశ మంటప రచన నీరాజన మంత్రపుష్పాలు అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఏప్రిల్ 1వతేదీన ఆలయ శిఖర సహిత స్థాపిత సర్వదేవతలకు భక్తులచే మహా కుంభాభిషేకం మహానీరాజన మంత్ర పుష్పములు ఆశీర్వచనములు పండిత సత్కారములు ఉంటాయని ఆలయ కమిటి పెద్దలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ముఖ్య సలహాదారులు కోటమృత్ కుమార్ గుప్త, సలహాదారులు సత్యవర్ధన్ గుప్త, ప్రధాన కార్యదర్శి ఆకుతోట విఠల్ గుప్త, ఉపాధ్యక్షులు మురారి శెట్టి కృష్ణమూర్తి గుప్త, కోశాధికారి దుద్దెల్ల శంకరయ్య గుప్త, ట్రస్ట్ సభ్యులు తిపిరిశెట్టి క్రిష్ణమూర్తి గుప్త, పల్లె వెంకటేష్ గుప్త, బూర్గుల లక్ష్మణ్ గుప్త, నేతి వెంకటేష్ గుప్త,దాస ఆంజనేయులు గుప్త, కొమిరి శెట్టి పద్మ శ్రీనువాస్ గుప్త, సరాబు మాధవి శ్రీనువాస్ గుప్త, కాచం నర్సింహా గుప్త, ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి శ్రీనువాస్ గుప్త, నర్సింహా గుప్త, లక్ష్మీనారాయణ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలి: ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: లోకసభ ఎన్నికల సందర్భంగా బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులుపనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ బిజెపి బూత్‌స్థాయి కోఆర్డినేటర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెపి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, సీనియర్‌నేతలు టి.గోపాల్, శ్రీకాంత్, దామోదర్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కార్యచరణపై దిశానిర్ధేశం చేశారు.

# చెరువు చిన్నబోయింది

## భారీగా తగ్గుముఖం పట్టిన 3,500 చెరువులు, కుంటల విస్తీర్ణం

హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త: మహానగరంలో చెరువులు, కుంటలకు పట్టణీకరణ శాపంగా పరిణమిస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డుకు లోపలున్న సుమారు 3,500 చెరువులు, కుంటల విస్తీర్ణం భారీగా తగ్గుముఖం పడుతోంది. ఆయా జలవనరులకు సంబంధించిన భూములు కబ్జాకు గురవడం, ఎఫ్‌టీఎల్‌కు ఆనుకొనే విల్లాలు, రియల్ వెంచర్లు, బహుళ అంతస్తుల భవంతులు వెలియడంతో విలువైన జలాశయాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టి రోజురోజుకూ చిన్నబోతున్నాయి. విలువైన జలవనరులు ఇలా అన్యాక్రాంతం కావడంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔటర్‌కు లోపల చిన్న పెద్ద చెరువులు, కుంటల సంఖ్య 3,500 కాగా..వీటి విస్తీర్ణం 2005లో సుమారు 30,978 ఎకరాలుగా ఉండేది. ఆ తర్వాత రియల్ రంగం పురోగమించడం, పొరుగు రాష్ట్రాలు, దేశాల నుంచి ఉద్యోగాలు, వ్యాపారాల కోసం సిటీకి వలసలు అధికమవడంతో శివార్లలో రియల్ రంగం జోరందుతుంది. ఇదే క్రమంలో అక్రమార్కుల కన్ను విలువైన జలాశయాలపై పడింది. జీవో 111 పరిధిలో ఉన్న గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిబంధనలకు విరుద్ధంగా విల్లాలు, రియల్ వెంచర్లు, వాణిజ్య స్థలాలు బహుళ అంతస్తుల భవంతులు వెలిసి ఒకప్పుడు పచ్చటి పంట పొలాలు, నిండుకుండలను తలపించే చెరువులు, కుంటలతో కళకళలాడిన ప్రాంతాలు ఇప్పుడు కాంక్రీట్ మహారణ్యంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా జలవనరుల విస్తీర్ణం ఇప్పుడు గణనీయంగా తగ్గుముఖం పట్టి 5641 ఎకరాలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. అంటే గత 13 ఏళ్ళ కాలంలో సుమారు 80 శాతం మేర వీటి విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఇందుకు పట్టణీకరణ ప్రభావం ఒక కారణమైతే రెవెన్యూ, పంచాయతీరాజ్, చిన్ననీటి పారుదలశాఖల నిర్లక్ష్యం మరో కారణంగా ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

నిజాంపేట్, రామంతాపూర్, కోర్‌సిటీ శివార్లు ప్రాంతమేదైనా సరే భారీ వర్షాలు కురిస్తే చాలు చెరువులు, కుంటలకు ఆనుకొని ఉన్న సముదాయాల్లో నివాసితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతకాల్సిందే. జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోకి చెరువులు తరలిరావడం మనం చేస్తున్నదే. దీనికి ప్రధాన కారణం జలాశయాల గర్భంలోకి నివాస సముదాయాలు చేరడమేనన్నది నిపుణుల మాట. పరిస్థితి తీవ్రంగా ఉన్నా సంబంధిత సర్కారు విభాగాలు కళ్ళు తెరవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు మహానగరంలో వర్షం కురిసినపుడు నీరు సాఫీగా వెళ్ళే మార్గం లేకపోవడం, వరదనీటి కాల్వల్లో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు, వర్షపునీటిని పీల్చుకునే ఏర్పాట్లు లేకపోవడం. చెరువు భూముల్లో భవనాల నిర్మాణం వంటి అంశాలే దీనికి కారణమని గుర్తించారు. సమస్యను పరిష్కరించేందుకు నగరంలో వరద నీటి కాలువల అధ్యయనం, తీసుకోవాల్సిన చర్యలపై కిర్లోస్కర్ కన్సల్టెంట్స్‌కు బాధ్యత అప్పగించారు. కాని ఆ నివేదిక నేటికి అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. నగరంలోని బుల్కాపూర్ నాలా, కూకట్‌పల్లి నాలా, ముర్కినాలా, పికెట్ నాలా, ఎర్రమంజిల్ నాలా, బంజారాహిల్స్ నాలా, ఎల్లారెడ్డిగూడ నాలా, పంజాగుట్ట నాలా, యూసుఫ్‌గూడ నాలా, నాగమయ్యకుంట నాలా, కళాసిగూడ నాలా, ఇందిరా పార్కు నాల, హుస్సేన్‌సాగర్ వరదనీటి కాలువ, మూసి నది ఇరువైపుల ప్రక్షాళన అరకొరగా సాగడం, అక్రమణలకు గురవడంతో వాటికి ఆనుకొని ఉన్న బస్తీలు, కాలనీవాసులు దినదిన గండంగా కాలం గడుపుతున్నారు.

### చేయాల్సినవి ఇవీ..

- చెరువులు, కుంటలను కాబ్జా చేస్తున్న అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- ప్రతి జలాశయానికి ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించి పటిష్ట రక్షణ కంచె ఏర్పాటు చేయాలి. ఆయా జలాశయాల చుట్టూ పటిష్టమైన కట్టలు ఏర్పాటు చేయాలి.
- జలాశయాల చుట్టూ పెద్ద ఎత్తున హరితాహారం చేపట్టాలి.
- ప్రతి జలాశయం పరిరక్షణకు స్థానికులతో కమిటీని ఏర్పాటు చేయాలి.
- ఇప్పటికే అక్రమార్కుల చెరువులో ఉన్న భూములను రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకోవాలి.

## తెలంగాణలో సీమాంధ్ర కార్పొరేట్ ఆధిపత్యాన్ని నిర్మూలించాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్**



ప్రసంగిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్, చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ కోలా జనార్ధన్

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: తెలంగాణలోని అన్నిరంగాల్లో సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల ఆధిపత్యాన్ని నిర్మూలించడమే తెలంగాణ పునర్నిర్మాణ లక్ష్యమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలలో తెలంగాణ ఉద్యమకారులఫోరం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాల ప్రత్యేక సంస్థానంగా ఉన్న తెలంగాణను సీమాంధ్రలో కలిపి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు చేసిన తర్వాత సీమాంధ్ర కార్పొరేట్‌వర్గాలు తెలంగాణలోని భూములను, వనరులను దోచుకోవడం జరిగిందన్నారు. ఈ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగిందని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఇంకా వారి ఆధిపత్యం కొనసాగుతుండడం దారుణమన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని, మాజీ సిఎం కెసిఆర్ ఉద్యమకారులను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణలో ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యమకారులకు 200 గజాల భూమి, ఉద్యమకారులకు 2 ఎకరాల్లో భవనం, పెన్షన్, బస్‌పాస్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని, సిఎం వద్ద ప్రస్తావిస్తానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ మద్దతు పలుకుతారని ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఉద్యమకారుల కోసం 250 గజాల ఇంటి స్థలం హామీని ఆరు గ్యారెంటీల్లో ఇవ్వడం జరిగిందని, హామీ ప్రకారం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులివ్వడంతో పాటు జూన్ 2న ఉద్యమకారులను ఆయా ప్రాంతాల్లో సన్మానించాలని, రూ.10వేల కోట్లతో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు ఉచితబస్‌పాస్, ఆరోగ్య బీమా, ఫించన్

మిగతా సిటీ 3వ పేజీలో

## సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం



సిఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్, మాజీ ఎమ్మెల్యే మేరీ రవిండ్రనాథ్,సృజన్

అడ్డగుట్ట, మార్చి 31 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పార్లమెంట్ సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిని బారీ మెజార్టీతో గెలిపించాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్య నేతలకు సూచించారు. ఆదివారం సికింద్రాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మేరీ రవింద్రనాథ్, యువజన కాంగ్రెస్ నేతలు ఆదం సృజన్, కట్టెల శ్రీనివాస్ యాదవ్‌లు సిఎం రేవంత్ రెడ్డితో సమావేశమైయ్యారు. వచ్చే నెల 13న జరిగే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని సిఎం సూచించారని తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

## కడియం శ్రీహరిని విమర్శించే నైతికహక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: మాజీ మంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే నైతికహక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేశ్ మాదిగ పేర్కొన్నారు. కడియం శ్రీహరి మచ్చలేని నిజాయితీ గల రాజకీయ నాయకుడు, ఎలాంటి అవినీతి, అరాచకాలు, భూకబ్జాలు, దోపిడీలు చేయలేదని,ప్రజల ఆస్తులను గుంజుకోలేదని, నిజాయితీకి మారుపేరు కడియం శ్రీహరి అని అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గారె వెంకటేశ్ మాదిగ మాట్లాడారు. కెసిఆర్ కుటుంబం ఈ రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారని, బిఆర్ఎస్ నాయకుల దోపిడీకి అడ్డుఅదుపు లేదన్నారు.

## పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న సతీష్

కొంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త: ఎమ్మెల్సీకి అనుకూలంగా ఉన్న ఓ పత్రిక ఆర్ఎన్ఐ గుర్తిపు లేని ఓ డిజిటల్ పత్రికలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో సందేశ్ మీడియాలో పేయిడ్ ఆర్టికల్స్ ప్రచురించి ఆర్థిక దోపిడికి పాల్పడ్డారని ఆకుల సతీష్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో సర్దార్ పటేల్ నగర్ (కెపిహెచ్‌బి)లో అక్రమ నిర్మాణాలపై కథనం ప్రచురించి డబ్బులు డిమాండ్ చేసి కటకటాల పాలవ్వడం నిజంకాదా అని ప్రశ్నించారు. అక్రమాలు చేస్తూ, బ్లాక్ మెయిలింగ్ అడ్డదిడ్డంగా డబ్బులు సంపాదిస్తూ, అక్రమాల గూర్చి ప్రశ్నించడం సిగ్గుచేటని ఆదివారం విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కృష్ణ, సెక్రటరీ అరుణ్‌రావు, ప్రసాద్, స్పెషల్ మీడియా కో కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, భూపాల్‌రెడ్డి, స్పోక్స్ పర్సన్ కౌశిక్‌నాయుడు, సీనియర్ నాయకులు సచిన్, హనుమయ్య, మోహన్, ప్రదీప్, నవీన్, వర్మ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో సునితా లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోరంపేట కృష్ణ

నాచారం, మార్చి 31 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి సునీత మహెందర్ రెడ్డిని భారి మెజార్టీతో గెలిపిస్తామని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సీనియర్ నాయకులు బోరంపేట కృష్ణ, మేడ్చెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల రెడ్డి, చిలుకానగర్ డివిజన్ సీనియర్ నాయకులు ప్రకాష్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి చెప్పడం జరిగింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో నాయకులు కలిసి మల్కాజిగిరి అంటె రేవంత్ రెడ్డి అడ్డా అని నిరూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేష్ గుప్తా, ఉష, రేణుక, ప్రేమలత, రాజేష్, మహేష్, సీనిత తధితరులు పాల్గొన్నారు.

## నాచారం భవానినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రాగిరి మోహన్ రెడ్డి



నూతన కమిటీ

నాచారం, మార్చి 31 ప్రభాతవార్త: నాచారం భవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడుగా రాగిరి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల మధుసూధన్ రెడ్డి, కోశాధికారిగా ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులుగా భావాని అశోక్, విష్ణు వర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, రాయుడు, రమేష్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, తోట రమేష్, శ్రీధర్ రెడ్డి, సురేందర్, శ్రీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నవీన్ గౌడ్, సంతోష్ కుమార్, జనార్థన్ రెడ్డి, రాంమోహన్, భాస్కర్ చారి తధితరులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు.

## 'తొలి దళిత కవి దున్న ఇద్దాసు



పాల్గొన్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: సాహిత్య, సంస్కృతిని, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయులలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాన్ గుప్త అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తొలి దళిత కవి దున్నఇద్దాసు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, గాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును 'మాదిగ మహాయోగి'గా కీర్తించారని, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య రచయితలు ఇద్దాసును 'తొలి దళిత కవి'గా గుర్తించారన్నారు. సంకీర్తనాకారుడిగా, తత్త్వకవిగా ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగుకులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు అని అన్నారు.

## శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ఆల్ జోన్ల ప్రధాన కార్యదర్శి శ్రీకిషన్ శర్మ,ప్రతినిధి టిప్పుసోనీ తదితరులు

చార్మినార్,మార్చి 31 ప్రభాతవార్త : శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ఆల్ జోన్ల ప్రధాన కార్యదర్శి శ్రీ కిషన్ శర్మ అన్నారు. పాత బస్తీ ఘాన్సీ బజార్‌లోని గాయత్రి భవన్‌లో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి సౌత్ జోన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సమావేశంలో పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రతినిధులు అబ్దుల్ ఖాజా మొయిజ్, దాకన్.జయిస్,గాజిద్దీన్,ఉమేందర్,అనిసూర్ రెహ్మాన్, మునీర్ ఖాద్రి పాల్గొన్నారు,సౌత్ జోన్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సౌత్‌జోన్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి నూతన అధ్యక్షులుగా జె.రామారాజు,ఆర్గనేజింగ్ కార్యదర్శిగా సీ ధర్మేందర్‌రావు నియమితులయ్యారు.కమిటి ప్రతినిధులు టిప్పుసోనీ, వరకాల సత్యనారాయణ,సౌమ విజయ్ కుమార్,యారాల మహేష్,యశోదమ్మ,ఫయాజ్, నూతన కార్యవర్గం సభ్యులను అభినందించారు.

## హెబ్రోన్ చర్చ్‌లో ఈస్టర్ వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: గోల్కొండక్రాస్‌రోడ్స్‌లోని బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చ్‌లో ఆదివారం ఈస్టర్ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. సొసైటీ చైర్మన్ బ్రదర్ జోసెఫ్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గుడ్‌ఫ్రైడే నాడు శిలువపై మరణించిన యేసు ప్రభువు మూడువ రోజు సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున నుంచే కొవ్వొత్తులు వెలిగించి హైబ్రోన్ దైవసేవకులు బ్రదర్ ఎన్.జయరాజు, ఫ్రాన్సిస్, ఈస్టర్ సందేశాన్ని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని గుర్తుచేస్తూ పాటలు పాడారు. ఈస్టర్ వేడుకలకు భక్తులకు అధిక సంఖ్యలో తరలిరావడంతో చర్చ్ ఆవరణ సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రైస్తవులు, దైవసేవకులు తరలిరావడంతో చర్చి ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది.

### పాతబస్తీలో షియా ముస్లింల ర్యాలీ

మొదటి పేజీ తరువాయి..

బిజెపి అభ్యర్థి డాక్టర్ కె.మాధవి లత,సీనియర్ బిజెపి నాయకులు ఫీర్ పిరాసత్ అలీ బాక్రీతో పాటు ఆల్ ఇండియా షియా ముస్లిం కాన్ఫరెన్స్‌కు చెందిన ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా దక్షిణ మండలం పోలీసులు పాతనగరంలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



కంటోన్మెంట్‌లో యువజన కాంగ్రెస్ నేతలతో సమావేశమైన కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా రెడ్డి తనయుడు రినీష్‌రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త: దేశంలో అతి పెద్ద పార్లమెంట్‌గా అవతరించిన మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని పట్నం సునీతా మహేందర్ రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించేందుకు యువతీ, యువకులు, మహిళలు చురుకుగా పనిచేయాలని కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా రెడ్డి తనయుడు రినీష్ రెడ్డి సూచించారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, కార్ఖాన, పికెట్, మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ముఖ్య నేతలతో బేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్‌లో అసెంబ్లీ ఉప ఎన్నికలు కూడా ఉన్నాయని, అందుకు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు యువత చురుకుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బొల్లు కిషన్, కాంగ్రెస్ నేతలు దశరత్ రెడ్డి, నాగిరెడ్డి, ఎస్.వెంకటేష్, సందీప్, ఆర్.డి.నాగేశ్‌యాదవ్, డి.బాబురావ్, సదానంద్, బాల్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

## పోలీసుల నిఘాకు చిక్కిన గంజాయి స్మగ్లర్ మఫ్టీలో మాటువేసి పట్టిన ఖాకీలు

హైదరాబాద్, మార్చి 31, ప్రభాత వార్త: బతుకుతెరువు కోసం నగరానికి వస్తున్న మధ్యతరగతి యువతలోని కొందరు ఇన్‌స్టెంట్ మనీ కోసం గంజాయి స్మగ్లర్లుగా మారి తప్పుడు దారి తొక్కుతూ జీవితాలని నాశనం చేసుకుంటున్నారని పోలీస్ శాఖ అధికారులు వాపోతున్నారు. సనత్‌నగర్ ప్రాంతంలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఒక వ్యక్తిని మఫ్టీలో మాటు వేసి ఉన్న పోలీసులు అరెస్టు చేశారు. సనత్‌నగర్ పోలీసుల సహకారంతో సైబరాబాద్ ఎస్ఓటి మాధాపూర్ టీమ్, గంజాయి తరలిస్తున్న ఆ నిందితుడి మీద నిఘా పెట్టారు. పోలీసు శాఖ వారు అందించిన వివరాల ప్రకారం, బతుకుతెరువు కోసం భాగ్యనగరానికి వచ్చిన సూల సురేష్‌నాయుడు(24) స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా సీతాంగరం దగ్గర లంకూరు గ్రామం.హైదరాబాద్ లోని షాపూర్ నగర్‌లోని సంజయ్ గాంధీ నగర్‌లో ఉంటున్న అతనికి సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశ ఉండడం వల్ల గంజాయి స్మగ్లింగ్‌కి పాల్పడినట్టుగా పోలీసులు తెలిపారు. ఇటీవలె సనత్‌నగర్ ప్రాంతంలో సురేష్‌నాయుడు గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా సమాచారం అందుకున్న మాధాపూర్ ఎస్ఓటీ పోలీసులు, సనత్‌నగర్ పోలీసుల సహకారంతో నిఘా పెట్టి నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్న అనంతరం రూ.16,500 విలువ చేసే పావుకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, కర్ణాటకా సరిహద్దులోని బీదర్‌లో జరీనా అనే మహిళా స్మగ్లర్ నుంచి సురేష్‌నాయుడు గంజాయి సేఖరించినట్లుగా సమాచారం రాబట్టారు. సరకు అందిన ప్రతీ సారీ అతడు గంజాయిని పొట్లాలుగా కట్టి రహస్యంగా విద్యార్థులకూ, కూలీలకూ విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం జరీనా అనే మహిళా స్మగ్లర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాలలో అధ్యయనాల్లో చాలా వెనుకబడ్డాం: ఆర్ కృష్ణయ్య



ప్రసంగిస్తున్న ర్.కృష్ణయ్య, కోలా జనార్థన్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ అంశాల చేయవలసిన అధ్యయనాల్లో చాలా వెనుకబడ్డాయని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో టిజెఏసీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ళ జనార్దన్ అధ్యక్షతన టివైఆర్ ఫౌండేషన్ అధినేత తలకొక్కుల రాజు ఆధ్వర్యంలో రూ.1.20లక్షల విలువ చేసే పుస్తకాలు, గ్రంథాలయానికి అవసరమై న ఫర్నీచర్‌ను అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ, నందగోపాల్, సుధాకర్, స్వరూప, మాస్టర్జీ, ఫౌండేషన్ ప్రతినిధులు రాహుల్, రోహిత్, వైస్‌చైర్మన్ విజయలక్ష్మి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒకతరం నుంచి ఇంకో తరానికి ఒక ప్రాంత నుంచి ఇంకో ప్రాంతానికి జ్ఞానాన్ని పంచుకోవడంలో గ్రంథాలయాల పాత్ర ప్రధానమైం దని అన్నారు. ప్రస్తుతం సామాజిక స్థితిగతులను అధ్యయనంచేస్తే దేశంలో సామాజిక వివక్షత యధావిధిగా కొనసాగుతుండగా, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయన్నారు. సమాజంలో చైతన్యం పెరిగినప్పుడే ఆర్థిక సమానత్వం దిశగా అడుగులు వేయడం జరగడం లేదన్నారు.

## యువత జగ్జీవన్ అడుగు జాడల్లో నడవాలి



కార్పొరేట్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్ మార్చి31,ప్రభాతవార్త : యువత బాబు జగ్జీవన్ రామ్ అడుగు జాడల్లో నడవాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కి సంబంధించిన కార్పొరేటర్లను మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చం నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం ,కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో కలిశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి,పొడుగు అర్చన జయ ప్రకాష్,సంగీత గౌరిశంకర్,అబేధా సుల్తానా,మోబిన్‌లకు ఏప్రిల్ 5న అరంఘర్ చౌరస్తాలో నిర్వహించే బాబు జగ్జీవన్ జయంతి వేడుకల ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ కార్యక్రమంలో జీవన్ దాస్,శ్రీరాములు,దయానంద్,గోల్కొండ రాజ్ కుమార్,పంబాల రాజు,బాబు రావు,ప్రీతం రాజ్,తలారి రాజ్ కుమార్,బర్ల సుమన్,జంగయ్య,ఉపేందర్, సంజీవ, ఎడ్లకాడి చంద్ర శేఖర్,మహేష్,కవ్వగూడెం గౌతమ్,రమేష్,వికాస్,తదితరులు ఉన్నారు.

## ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి



హైమావతి నగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం కమిటి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కమిటి సభ్యులు

యూసఫ్‌గూడ, మార్చి 31, ప్రభాత వార్త : శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి తమ వంతు కృషిచేయడం జరుగుతుందని ఆలయ అధ్యక్షులు డాక్టర్ గూడురి చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటి ఉపాధ్యక్షులు బి.శ్రీనువాస్ ఇటీవల మరణించడంతో ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం దేవాలయంలో చేపట్టే అభివృద్ధి పనుల గురించి చర్చించడం జరిగింది.త్వరలోనే ఉపాధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆలయ అభివృద్ధితో పాటు దేవాలయ కమిటిలో వ్యక్తులను చేర్చుకునేందుకు తప్పనిసరిగా కమిటిలో మెంబర్ షిప్ తీసుకోవాలని అందులో లైఫ్ మెంబర్‌గా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, సాధారణ మెంబర్‌గా ఏదేని ఒక మెంబర్‌షిప్ కలిగి ఉండాల్సిన అవసరం తప్పని సరి అని అన్నారు.ఈకార్యక్రమంలో కెపెచ్‌ఎఫ్ శర్మ, మహేందర్‌రెడ్డి, శ్రీరాములు, సి.శోభారెడ్డి, జాయింట్ సెక్రటరీ బికె డాక్టర్ విజయ లక్ష్మీ, దూడల రవిగౌడ్, సురేష్ కుమార్, శంకర్, బాలు, మధు, రాము, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 31 ప్రభాతవార్త : గుర్తు తెలియని నలభై సంవత్సరాలు వయస్సు గల ఓ మహిళ మృత దేహం లభ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.....ఆరాంఘర్ చౌరస్తా దాటిన తర్వాత శంషాబాద్ వెళ్లె రహదారిలో ఎస్‌విఎం మాల్ ప్రక్కనే ఉన్న నిర్మానుష్యం ప్రదేశంలో గుర్తు తెలియని 30 నుంచి 40 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని ఓ మహిళ మృత దేహం పడి ఉంది.చని పోయిన మహిళ మృత దేహంపై గ్రీన్ కలర్ జాకెట్,ఎరుపు పసుపు రంగుల పువ్వుల డిజైన్‌లు గల నలుపు చీర వస్త్రాలు ఉన్నాయి.గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురిలో భద్రపరిచారు.ఈ గుర్తు తెలియని మహిళకు సంబధించిన కుటుంబ సభ్యులు,బంధు మిత్రులు9490617459 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలి.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## అందరిని ఆకట్టుకున్న అన్నమయ్య అమృతధార ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, నృత్యకిన్నెర సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 'అన్నమయ్య అమృతధార' పేరుతో కూచిపూడి నృత్యకళాకారులు నిర్వహించిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారగ్రహీత, నృత్యగురువు డాక్టర్ మద్దాళి ఉషాగాయత్రి శిష్య బృందం వివిధ అంశాలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు.



7వ వార్డు చంద్రపురి కాలనీలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత శ్రీగణేష్ తదితరులు

## భగవంతున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : శ్రీగణేష్

కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ కాంగ్రెస్ నేత శ్రీగణేష్ తెలిపారు. 7వ వార్డు తిరుమలగిరి చంద్రపురి కాలనీలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవంతున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు.

## ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత కార్యకర్తపై ఉంది



గాయత్రినగర్‌లో బీజేపి పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు, నియోజకవర్గం అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు

యూసుఫ్‌గూడ, మార్చి 31, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే బాధ్యత కార్యకర్తపై ఉందని రాష్ట్ర కార్యదర్శి వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం బీజెపి మేడ్చల్ జిల్లా కార్యదర్శి పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈసందర్భంగా వివేకానందనగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.చెల్లయ్య వారి అనుచరులతో కలిసి బీజేపి పార్టీలో మాదవరం కాంతారావు, వడ్డెపల్లి రాజేశ్వర్‌రావులు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.చెల్లయ్యతో పాటు రాజేష్, గణేష్, రవిలను పార్టీలో చేర్చుకున్నారు.

## తెలంగాణలో సీమాంధ్ర కార్పొరేట్ ఆధిపత్యాన్ని నిర్మూలించాలి

కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిజస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ కూడా ఇంకా సీమాంధ్ర కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం కొనసాగడడం అత్యంత విచారకరనమన్నారు. సీమాంధ్ర కార్పొరేట్‌వర్గాలు ఆక్రమించిన ప్రభుత్వభూములను వెనక్కి తీసుకోవాలని, తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ళ సురేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోలా జనార్దన్, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జనిగ విష్ణువర్దన్, నరేందర్‌గౌడ్, బల్దేవ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కొంతము యాదిరెడ్డి, అనంతలక్ష్మి, మోకాటి రాంబాబు, ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి జెఎన్‌టియులో ముగిసిన ఏఐ ఎంఎల్ ఏఐ డేస్ 2024 కాన్ఫరెన్స్




కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 31, ప్రభాత వార్త : భారతదేశంలోని అతిపెద్ద కాన్ఫరెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లార్నింగ్ (ఎంఎల్)ఎఫ్ ఏఐడే 2024 హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జెఎన్‌టియులో ఆదివారం ముగిసింది. దీనిని ఏఐ4సొసైటీ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. భాగస్వాముల సహకారంతో స్వేచ్ఛ ఈ రెండు రోజుల కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వం ఐ అండ్ సి, ఐటీ, ఈ అండ్ సి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ హాజరయ్యారు. ప్రఖ్యాత కంప్యూటర్ సౌంటిస్ట్, ఇంజనీర్ డాక్టర్ కృష్ణ పాలెం, స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై.కిరణ్ చంద్ర, స్వేచ్ఛ కార్యదర్శి ప్రవీణ్ చంద్రలు పాల్గొన్నారు. ఈ సందస్సులో రెండు వేల మందికి పైగా ఐటి నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులతో పాటు ప్రముఖ టెక్ కంపెనీల నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఏఐ, ఎంఎల్ నిపుణులు హాజరయ్యారు. ఈ సదస్సుతో హైదరాబాద్ ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం అవుతుంది. ఏఐ డేస్ వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేర్చింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఫిన్‌టెక్, సెమీ కండక్టర్స్, ఎడ్యుటెక్, వివిధ స్టార్టప్‌లు సమాజ శ్రేయస్సు కోసం ఏఐని నిర్మించడంలో ముందుకు సాగే మార్గం కోసం గూగుల్, ఫేస్‌బుక్(మెటా) మైక్రోస్టాఫ్ట్, క్వాల్కామ్, మైక్రాన్, ఓజోనెటెల్, టెక్ వేదిక, డిజిక్వాన్టా, ఆర్కా మీడియా వర్క్స్ వంటి ఇతర సంస్థల స్పీకర్‌లు చర్చలలో పాల్గొన్నారు.

**NOTICE**

**IN THE COURT OF THE HON'BLE XXVII ADDL CHIEF JUDGE, CITY CIVIL COURTS AT SECUNDERABAD.**
**O.S.No. 10 OF 2024**

BETWEEN:
**Sri. Dr. Tuljaram Patalay and others ...Plaintiffs**
AND
**All Concerned & 2 others ...Defendants**

To
**1. All Concerned**

Take notice that the above suit was filed for declaration to declare the plaintiff's are the legal heirs of late Vishwanath Rao Patalay, who was the resident of H.No.10-3-27/3, East Marredpally, Near Hanuman Temple, Hyderabad, against all concerned and 2 others. If any person or persons have any objections in respect of the above suit appear before the above mentioned Hon'ble court on **16-04-2024 at 10:30 am** personally or through counsel, falling which the matter will be decided as per law.

// By order of the Court //
**P. CHANDRASHEKAR**
**Advocate**
Off: G-1, Ground Floor, Laxmi Residency, Barkatpura, Hyderabad. **9848933667**

# మల్కాజిగిరిలో కాంగ్రెస్‌దే విజయం : మంత్రి తుమ్మల


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న పట్నం సునీత మహేందర్ రెడ్డి

**సైదాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల ను పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని కొత్త కాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వందరోజుల కాంగ్రెస్ ప్రజా పాలన తెలంగాణ ప్రజల ఆధార అభిమానాలు పొందిందన్నారు. గత పార్ల మెంటు ఎన్నికల్లో ఎంపీగా రేవంత్‌రెడ్డిని ఘన విజయంతో గెలిపించినట్లుగానే ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని కూడా గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికలలో తుక్కుగూడలో నిర్వహించిన సోనియా గాంధీ సభతో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మీద అభిమానంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. అదే తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో నిర్వహిస్తున్న భారీ బహిరంగ ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి మోడల్ దేశమంతటికి ఆద ర్శంగా నిలుస్తుందన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా అమలు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాయన్నారు. వందరోజుల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన నీతి నియమాలతో ముందుకెళ్తుందని ఆయన పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి లో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమన్వయం లోపాలు లేకుండా కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థి ని భారీ మెజారిటీ తో గెలిపించాలని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ద్వారా పార్లమెంట్ పరిధిలో ని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమగ్ర అభివృద్ధి జరుతుందన్నారు. మూసీని ప్రక్షాళన, సమగ్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ను సుసంపన్న రాష్ట్రం గా తీర్చదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మధుయాష్కి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గ పాలన.. వంద రోజుల ప్రజాపాలన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వెళ్తుందన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. మల్కాజిగిరి లో ఎంపీగా గెలిపించి ప్రజలు ఇచ్చిన ఆత్మస్థైర్యం తో రేవంత్ రెడ్డి సీఎం వరకు ఎదిగారని పేర్కొన్నారు. కార్యకర్తలు అంతా పట్టుదలతో పని చేసి పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుం దన్నారు. సునీతమహేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేషన్ చైర్మన్‌లు చల్ల నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జిహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణరెడ్డి, ఆయా డివిజన్ల అధ్యక్షులు కుట్ల నరసింహయాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సదాశివుడు, బుద్ద సత్యనారాయణ, వేణుగోపాల్, సురేందర్‌రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, మల్లారపు శ్రీనివాస్, మంజుల తదితరులు హాజరయ్యారు.

## లెనిన్‌నగర్‌లో సిపిఐ నిర్మాణ మహాసభ


మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ నేత

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** బాలాపూర్ చౌరస్తా సమీపంలోని లెనిన్ నగర్ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం బాలాపూర్ మండల సిపిఐ నిర్మాణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అప్పనంగా దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నదని వారు ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు చేయూతనిస్తూ పేద ప్రజలపై భారం మోపిందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఈ సమావేశంలో బాలాపూర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యద ర్శిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కార్యవర్గానికి దశరథ, దేరంగుల శంకర య్య, రమావత్ శత్రునాయక్, పిచ్చిరాజు, నరేందర్, మిరియాల లక్ష్మమ్మ, వాణి, శివనాయక్‌లతో పాటు 21 మందిని ఎన్నుకున్నారు.

## లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఈస్టర్ వేడుకలు


గీతాలను ఆలపిస్తున్న చర్చి సంగీత బృందం

**వనస్థలిపురం, మార్చి 31 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సుదర్శన రావు ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ స్పీకర్ పాస్టర్ జెల్లా రాజ్‌కుమార్ ఈస్టర్ పండుగ యొక్క ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అనంతరం చర్చికి వచ్చిన క్రైస్తవ భక్తులు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు టిఎస్.బాబురావు, జార్జ్‌ముల్లర్, భానుకిరణ్, సురేష్‌కుమార్, ఎస్.జాన్, జాకబ్ ప్రసాద్, విజయలక్ష్మి, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన్‌దీప్ టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం చైర్మన్‌గా జగన్నాథ్‌రెడ్డి



జగన్నాథరెడ్డిని అభినందిస్తున్న శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట, మార్చి 31 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని జ్ఞాన్‌దీప్ టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం చైర్మన్‌గా జగన్నాథ్‌రెడ్డి మరోసారి ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లాట్ ఓనర్స్‌కు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషిచేస్తామన్నారు. అదేవిధంగా నూతన కమిటీని వెల్లడించారు. గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.రవీందర్, అధ్యక్షుడిగా ఫణి శాయన, ఉపాధ్యక్షుడిగా బి.రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా సురేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్, కార్యదర్శిగా శ్రీనివాస్, కార్య నిర్వాహక కార్యదర్శిగా దిలీప్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా విశ్వనాథం, భరత్‌నాయక్, హెచ్‌బి రాజు, నటరాజ్, పిఆర్‌ఓగా వెంకటేశ్వర్లు, సాంస్కృతిక కార్యదర్శిగా కుమార్ నియమితులైనట్లు సంక్షేమ సంఘం చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు.

## యేసు జీవితం అందరికీ ఆదర్శం : ప్రభుచరణ్


సమావేశంలో ప్రసంగిస్తున్న చర్చి పాస్టర్లు ప్రభుచరణ్, ఇమ్మాన్యుయేలు

**మలక్‌పేట, మార్చి 31 ప్రభాతవార్త :** యేసు జీవితం అందరికీ ఆదర్శమని మూసారాంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, పాస్టర్ ప్రభుచరణ్, చర్చి పాస్టర్ వన్య ఇమ్మాన్యుయేలు పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని చర్చిలో వారి ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుద్ధరణ అయ్యారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఇతరులపై ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలన్నారు. యేసు బోధనలు మంచి నడవడిక గురించి తెలియజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు : సామ్యూల్‌బాబు



సందేశం అందిస్తున్న పాస్టర్ సామ్యూల్‌బాబు తదితరులు

**మలక్‌పేట, మార్చి 31 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ కృష్ణతులసినగర్‌లోని బెతానియా బాప్టిస్టు చర్చిలో చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్‌బాబు ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సోదరభావంతో మెలగాలని, ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుద్ధరణ అయ్యారని తద్వారా మానవాళికి నిత్య జీవితాన్ని ప్రసాదించారని అన్నారు. యేసు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళి జీవితంలో ఆనందం, సంతోషాన్ని నింపిన యేసు జీవితం మార్గదర్శకమన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో శీల దొరతి బైరపోగు, సుధీర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో ఆర్య వైశ్య సంఘ అధ్యక్ష ఎన్నికలు


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఆర్యవైశ్య యువతి

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. మీర్‌పేట్ చౌరస్తా సమీపంలోనున్న టిఆర్ఆర్ హై స్కూల్‌లో ఎన్నికలు బ్యాలెట్ పద్దతిని నిర్వహించారు. ఉదయంనుండి సాయంత్రం జరిగిన పోలింగ్‌లో 1585 మంది ఆర్య వైశ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మంచన ప్రేమ్‌కుమార్ గుప్త, విట్టా శ్రీనివాస్ గుప్తలు పోటీ పడ్డారు. ఎన్నికల ఆధికారులు బిలకంటి కిరణ్‌కుమార్ గుప్త, పర్యవేక్షకులుగా నాళ్ళ శ్రీనివాస్‌గుప్త, సహాయ పర్యవేక్షకులుగా కుంచారపు రాజు గుప్త, మాశెట్టి ప్రభాకర్‌గుప్త, కొత్త రవిగుప్త, శ్యాం గుపప్త, బొగ్గారపు ఆంజనేయులు, కాచం చంద్రశేఖర్ గుప్త, కూన సతీష్‌గుప్తలు, నూకల శ్రీనాథ్‌గుప్తలు వ్యవహరించారు.

## బాప్టిస్టు చర్చిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు


సమావేశంలో ప్రసంగిస్తున్న పాస్టర్ సల్మాన్, చిత్రంలో శ్యాంకుమార్ తదితరులు

**మలక్‌పేట,మార్చి 31 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో చర్చి అధ్యక్షుడు విఎస్ ఇజ్రాయిల్ అధ్యక్షతన ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ బోద సాల్మన్, అసోసియేట్ ఫాస్టర్ శ్యాం కుమార్ తదితరులు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుద్ధర ణయ్యారని వివరించారు. యేసు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళి జీవితంలో ఆనందం, సంతోషాన్ని నింపిన యేసు జీవితం మార్గదర్శకమన్నారు. అదే విధంగా చర్చిలో పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలకు ఆజ్యం పోస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

# జిహెచ్ఎంసి ఆదాయానికి గండి

### ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి అధికారులే రాజ్యమేలుతున్న వైనం


అక్రమంగా నిర్మిస్తున్న భవనాలు

**ఎల్.బి.నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** టౌన్‌ప్లానింగ్ అధికారుల అండ దండలతో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గతంలో ఏసీబీ దాడులలో పట్టుబడినప్పటికీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులలో ఎటువంటి చలనం లేకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాలకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తూ సొంత జేబులు నింపుకోవడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు తాపత్రయ పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి టౌన్‌ప్లానింగ్ అధికారులపై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా నాలుగు ఐదు అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్న విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ భవన నిర్మాణంపై చర్యలు చేపట్టడం లేదని హయాత్‌నగర్, సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్లకు ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్న పైఅధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడంలేదని పలువురు వాపోతున్నారు. అక్రమ భవన నిర్మాణాల సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు అనంతరం అక్రమ నిర్మాణదారుల వద్ద వసూళ్లకు పాల్పడడం షరా మామూలుగా మారిపోయిందని పలువురు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు, ఉపకమిషనర్లు, సిటీప్లానర్, జోనల్ కమిషనర్ అవినీతి అధికారులపై దృష్టి సారించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అల్మాస్‌గూడ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,30,300


హుండీ లెక్కింపులో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాం 1,30,300 వచ్చింది. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. కమిటీ చైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సంరెడ్డి శేఖర్‌రెడ్డి, పలువురు డైరెక్టర్లు, పూజారులు తదితరుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించగా ఆదాయం 1,30,300 వచ్చింది. ఈ నగదు మొత్తాన్ని ఆలయ ఖాతాకు జమ చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దిండు శ్రీనివాస్‌గౌడ్, రామిడి సుభాష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామిడి మహేందర్‌రెడ్డి, కోశాధికారి పగడాల మురళి, తిరుమల గౌడ్, సాయికాంత్, వినోద్, నాగేందర్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రణయ్‌కు ప్రథమ స్థానం


నిర్వాహకుల నుండి పతకాన్ని, ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ప్రణయ్

**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :** డబ్ల్యుపీసీ ఇండియా జాతీయ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2024 పోటీల్లో ఉప్పల్ లోని శేషసాయినగర్‌కు చెందిన జె. ప్రణయ్ రాజ్ ప్రథమ స్థానం సాధించారు. డబ్ల్యుపీసీ ఇండియా జాతీయాధ్యక్షులు దల్జిత్ సింగ్ అధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని నోయిడాలో జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్-2024 పోటీలను మార్చి 30, 31న రెండు రోజులపాటు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొన్న ప్రణయ్ ఈ పోటీలలో అండర్- 19లోని 60కిలోల కేటగిరీ డెడ్‌లిఫ్ట్‌లో 160 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 67.5 కిలోలు, స్క్వాట్ లో 95 కిలోలు, ఆ మూడింటిలో మొత్తం 322.5 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం నిర్వాహకులనుండి పతకాలు, ప్రశంస పత్రాలను ప్రణయ్‌రాజ్ అందుకున్నాడు. ఈ సందర్భంగా డబ్ల్యుపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ మాట్లడుతూ.. తన పర్యవేక్షణలో నగర శివారులోని కొల్లూరు వీ.టీ.డీ. ఫిట్‌నెస్ సొల్యూషన్స్ జిమ్‌లో ప్రణయ్ ప్రత్యేక శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ, ఆసియన్ పోటీలలో తన ప్రతిభను చాటాడని కొనియాడారు. జాతీయ స్థాయి పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణయ్‌రాజ్ మాట్లాడుతూ.. తన గురువు ఇంటూరి రేఖ వద్ద తాను పొందిన శిక్షణ, ఆమె ఇచ్చిన సూచనలు, సలహాలు, మెళకువల కారణంగానే తాను ఆసియన్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించానని, ప్రస్తుతం జాతీయ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచానన్నారు. త్వరలో జరుగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సైతం పతకాలు సాధిస్తానని ప్రణయ్ ధీమా వ్యక్తం చేశారు.

## ఆత్మరక్షణకోసం బాలికలకు కరాటే ఎంతో దోహదపడుతుంది : విశ్వనాథ్


బాలికలకు బెల్ట్, సర్టిఫికెట్లను అందిస్తున్న చీఫ్ కోచ్ విశ్వనాథ్, కోచ్ నవీన్

**కుషాయిగూడ, మార్చి 31 ప్రభాతవార్త :** నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు దాడులను అడ్డుకోవడానికి బాలికలు ఆత్మ సంరక్షణకు కరాటేలో ప్రావీణ్యం సాధించాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కరాటే చీఫ్ కోచ్ విశ్వనాథ్, కోచ్ నవీన్లు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని హెచ్ బి కాలనీ మీర్పేట్ డివిజన్‌లో గల వైష్ణవి హైస్కూల్లో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణలో నైపుణ్యం పొందిన బాల బాలికలకు ఆరెంజ్ గ్రీన్ బెల్టుల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు నేటిసమాజంలో బాలిక మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కార్యకర్తడానికి స్వయం సంరక్షణకు గాను ఆత్మ సంరక్షణ కలిగి ఉండాలని అందుకు కరాటే ఉపయోగపడుతుందన్నారు. తద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యము పెరుగుతుందన్నారు. కరాటే శిక్షణను అధికారికంగా పాఠశాలలలో పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ నవీన్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రంజిత్‌రెడ్డి విజయం ఖాయం : కెఎల్ఆర్

### కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నేతల వలసలు


కేఎల్ఆర్, భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**ఎల్.బి.నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** చేవెళ్ల కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు యాదవ్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, శ్రీనివాసులు, పగడాల ఎల్లయ్య, శ్యాంసుందర్‌గౌడ్, శ్రీనివాసులు,రమేష్, మధుయాదవ్, శంకర్, సుజాతారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు, అంజరావ్, స్వామిగౌడ్, సాయితేజరెడ్డి, పురుషరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డిలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత పదేళ్ల బీజేపీ దోపిడీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్‌పార్టీనీ చేవెళ్ల పార్లమెంట్‌తో పాటు దేశ వ్యాప్తంగా భారీ మెజారిటీతో గెలిపిండానికి ప్రజలంత సిద్ధంగా ఉన్నారన్నారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజల ఆస్తులను భారీగా కార్పొరేట్ కంపెనీలకు దిచిపెట్టిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పిట్ట హరినాద్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, మహేందర్, గట్ల రవీంద్ర, సురేష్, కాళిదాస్, సైదులు, శ్రీకాంత్‌రెడ్డి, విప్లవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి : ఉప్పల


సైక్లింగ్ క్రీడను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర పర్యటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఐ.వి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నాగోల్ డివిజన్ బండ్లగూడ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఆవరణలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ (సౌత్ జోన్ హైదరాబాద్) కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆటల పోటీలు క్రీడాస్ఫూర్తిని పెంచుతాయని, గెలుపు ఓటములు ముఖ్యంకాదని, ప్రతి ఆటను స్పోర్టివ్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం ఆటల కోసం కేటాయిస్తే ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడాకారులు మంచిగా క్రీడలలో రాణించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడునుంచి 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-16, అండర్-18, అండర్-18, జూనియర్స్ అండ్ సీనియర్స్ ఉమెన్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ సౌత్ జోన్ కోఆర్డినేటర్ డాక్టర్ మాక్స్వెల్ ట్రావెర్, ఎస్.కె.పాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి నాయకుల, కార్యకర్తలు భారీగా చేరికలు


పార్టీలో చేరినవారితో సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్ తదితరులు

**బోడుప్పల్, మార్చి 31 ప్రభాతవార్త:** మేడ్చల్ నియోజకవర్గం, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఆదివారం పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత పదేళ్ల బిఆర్ఎస్, బీజేపీ దోపిడీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీనీ దేశ వ్యాప్తంగా భారీ మెజారిటీతో గెలిపిండానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజల ఆస్తులను భారీగా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.